# సింగిల్ పేజీ కథలు

# కలిసిన రేఖలు

'కౌసల్యా సుప్రజా రామా
పూర్వాసంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల
కర్తవ్యం దైవ మాహ్నికమ్'

శ్రావ్యమైన గొంతుతో వినవస్తున్న సుప్రభాతం కళ్యాణ్‌ని మేలుకొలిపింది. రేఖ గొంతులో ఎంత మాధుర్యం ఉంది! ఇన్నాళ్లూ తను ఎలా మిస్ అయ్యాడు? అంతా కలలాగ ఉంది. రేఖ తన స్వంతమవుతుందని తను భావించలేదు. కాలేజీలో చదువుతుండగా ఆమెను ఎంతో ఆరాధించేవాడు తను! ఆ సుమధుర గొంతంటే తనకెంతో ఇష్టం. నెలరోజుల క్రితం జరిగిన ఆ సంఘటన గుర్తొచ్చి అతని హృదయం పులకరించిపోయింది. తమ జీవితం ఓ మంచి మలుపు తిరిగిన రోజు.

* * *

ఆరోజే రామారావు వైజాగ్ నుండి తిరిగొచ్చిన తర్వాత కళ్యాణ్‌కి ఫోన్ చేశాడు- అర్జెంట్‌గా తన ఇంటికి రమ్మని, విషయమేమిటో చెప్పకుండా.

అందుకే ఆ సాయంకాలం స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. అయితే రామారావు చెప్పిన మాట విని ఆశ్చర్యపోయాడు.

"ఏమిటి? రేఖని నువ్వు కలిశావా వైజాగ్‌లో? ఆమెకి ఇంకా పెళ్లవ్వలేదా? ఇంతవరకూ పెళ్లి చేసుకోలేదా! నిజమా నువ్వు అన్నది?" ఇంకా నమ్మలేకపోతూ అన్నాడు కళ్యాణ్.

"అవున్రా! నిజమే చెప్తున్నాను. మొన్న వైజాగ్ వెళ్లినప్పుడే తెలిసింది. చాలా సంవత్సరాలైంది ఆమెని కలిసి. నీకు తెలుసు కదా! నా శ్రీమతి, ఆమె చాలా క్లోజ్ ఫ్రెండ్సని. అనుకోకుండా ఆమె కనిపించింది. ఆమె ఇంటికి వెళ్లాం కూడా! ఆమెకి ప్రమోషన్ వచ్చి అదే కాలేజీలో ప్రిన్సిపాల్‌గా ఉంది" ఓ క్షణం ఆగి అన్నాడు.

"మాకిద్దరికి తెలీని విషయం ఒకటి, నా శ్రీమతి ఆరా తీయడంతో తెలిసింది. ఆమె నిన్ను గాఢంగా ప్రేమించింది. వాళ్ల నాన్నగారికి ట్రాన్స్‌ఫరై వెళ్లిపోవటంతో మీ దార్లు వేరయిపోయాయి. ఆమె మీద ఇంటి బాధ్యతలు పడటంతోనే కాక నిన్ను మనసులోనే ఆరాధించడం వల్ల ఆమె మరింక పెళ్లి ఊసెత్తలేదు. మీరిద్దరూ నాలుగేళ్ల క్రితం కలుసుకున్నారట కదా! అయితే ఆమెకి కూడా నువ్వు పెళ్లి చేసుకోలేదన్న విషయం తెలియలేదు. నువ్వు పెళ్లి చేసుకొని సుఖంగా ఉంటావని భావించింది. ఆమె మరి" అన్నాడు రామారావు.

నాలుగేళ్ల కిందట తమిద్దరం కోణార్క్ ట్రైన్‌లో కలుసుకున్న విషయం గుర్తొచ్చింది కళ్యాణ్‌కి.

"ఆరోజు ఇద్దరం కలిసి ప్రయాణించాం. ఆమె విజయవాడ వరకు నాకు కంపెనీ ఇచ్చింది. ఎవరో స్నేహితురాలి కూతురి పెళ్లికి వెళ్తూ చాలా రోజుల తర్వాత కలవడం వలన చాలా మాట్లాడుకున్నాం. అయితే ఆమె వివాహం జరిగి తన వైవాహిక జీవితం ఆనందంతో నిండి ఉంటుందని భావించాను. నా గురించి కూడా ఆమెకి



ఏమీ చెప్పలేకపోయాను. చాలా పెద్ద పొరపాటు జరిగిపోయింది" అన్నాడు కళ్యాణ్. అతని కంఠంలో కాస్త విషాదం నిండి ఉండటం గమనించాడు రామారావు.

"నువ్వు కూడా రేఖని ప్రేమించావన్న సంగతి నాకూ తెలియలేదు, నువ్వు తెలియపర్చే వరకూ. ఎవర్నో ప్రేమించి భంగపడ్డావనుకున్నాను. కానీ ఆమె రేఖన్న సంగతి నాకూ తెలీదు. అయితే మీరిద్దరూ క్రితంసారి కలుసుకున్నప్పుడు కూడా మనసు విప్పి మాట్లాడుకోకపోవటం వలన మీకిద్దరికీ తెలియలేదు. పోనీలే, ఇప్పటికైనా నిజం తెలిసింది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. మీరిద్దరూ పెళ్లి చేసుకుంటే చాలా బాగుంటుంది. ఇద్దరి జీవితాలు బాగుపడతాయి" అన్నాడు రామారావు.

"ఇప్పుడా!" నివ్వెరపోయాడు కళ్యాణ్, ఓ క్షణం తన వయసు గుర్తుకు వచ్చి.

"ఈ వయసులో పెళ్లి చేసుకుంటే అందరూ నవ్వుతారేమో! ఇద్దరి వయసు యాభై దాటాయి కూడా!"

"అయితే మాత్రం? మీరేమీ కాని పని చేయడం లేదు కదా! ఇద్దరూ పెళ్లికానివాళ్లే. ఇన్నాళ్లూ ఒకర్నొకరు మనసులో ఆరాధించుకున్నారు. ఒకరికి తెలియకుండా మరొకరు ప్రేమించుకున్నారు. ఇద్దరూ ఒంటరివాళ్లు. పైగా పెళ్లి చేసుకోవడంలో తప్పేముంది? మోడువారిన మీ జీవితాలు తిరిగి చిగురిస్తాయి. మీ ప్రేమకో సార్థకత ఏర్పడుతుంది. ప్రేమకి పరిపూర్ణత లభిస్తుంది. అంతగా అయితే సింపుల్‌గా గుళ్లోకానీ, రిజిస్ట్రార్ ఆఫీసులోగానీ పెళ్లి చేసుకుంటే సరి" అన్న రామారావు మాటలని సమర్థిస్తూ అంది, రామారావు భార్య సరోజ కాఫీ అందిస్తూ.

"అవును అన్నయ్యగారు! ఆయన చెప్పింది కరెక్టే. ఇన్నాళ్ల మీ ఇద్దరి నిరీక్షణకి ఫలితం లభిస్తుంది. మా రేఖ జీవితంలో సంతోషం, ఆనందం తొంగిచూడాలని ఉంది. ఇప్పటికైనా మీరిద్దరూ పెళ్లి చేసుకొని ఓ ఇంటివారైతే మాకంటే సంతోషించే వారుండరు. మీరు ఒప్పుకుంటే నేను వెంటనే రేఖకి ఈ విషయం తెలియపరుస్తాను. ఆమెకి కూడా ఈ విషయం తెలిసి మీ అంగీకారం కొరకే ఎదురుచూస్తున్నది."

కళ్యాణ్ మనసు ఆనందంతో ఉరకలు వేసింది.

"నేనే రేఖతో మాట్లాడతాను. నాకు ఆమె ఫోన్ నెంబరు ఇవ్వండి" అన్నాడు.

ఆ తర్వాత వారం రోజుల్లోపలే గుళ్లో పెళ్లి చేసుకొని, అట్నుంచి రిజిస్ట్రార్ ఆఫీసుకి వెళ్లి వివాహం నమోదు చేసుకున్నారు కళ్యాణ్, రేఖ.

ఎన్నో ఏళ్ల ప్రేమ ఫలించిన రోజు, నిరీక్షణ సార్థకమైన రోజు. చాలా ఆలస్యంగానైనా వాళ్లిద్దరి రేఖలు కలిసి దంపతులయ్యారు.

చాలా ఏళ్ల తర్వాత వాళ్లిద్దరిలో సంతోష రేఖలు తొంగిచూశాయి. ఇంతకాలం ఏం కోల్పోయారో అర్థమయింది ఇద్దరికీ.

"సారీ రేఖా! ఆరోజు ట్రైన్‌లో కలిసినప్పుడు మనసు విప్పి వివరంగా మనం మాట్లాడుకొనుంటే, మనం అప్పుడే దంపతులయి ఉండేవాళ్లం" అన్నాడు ఆరోజు రాత్రి కళ్యాణ్.

"సారీ కళ్యాణ్! పొరపాటు మనిద్దరిదీ. నేనూ నీతో మనసు విప్పి మాట్లాడలేకపోయాను. ఎప్పుడో ముప్పై ఏళ్ల క్రితం మన ప్రేమ ఫలించి ఉండవలసింది. ఇప్పటికైనా ఒకటయ్యాం. మనని కలిపిన రామారావు దంపతులకి మన కృతజ్ఞతలు తెలుపుకోవాలి" ఆమె కళ్లల్లో ఆర్ద్రత.

"అవును. మనని కలిపిన పుణ్యం వాళ్లదే!" అన్నాడు కళ్యాణ్ సంతోషంగా.

**-డి.వి.డి.ప్రసాద్ (బరంపురం)**